ప్రత్యేక శాఖగా వికలాంగుల సంక్షేమం : మంత్రి కొప్పుల ఈశ్వర్

ప్రజాశక్తి -కల్చరల్

వికలాంగుల సంక్షేమ శాఖ ప్రత్యేక శాఖగా కొనసాగుతుందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. శనివారం ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంక్షేమంలో ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని పురోగమనలోకి తీసుకెళ్తున్నారని కితాబునిచ్చారు. భవిష్యత్తులో మరిన్ని ప్రణాళికలతో వికలాంగుల సంక్షేమ శాఖను ముందుకు తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో వికలాంగులకు అమలు చేస్తున్న పథకాలు ఏ దేశంలో అమలు కావడం లేదన్నారు. 2016 నుంచి నేటి వరకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో కలిసి ఉన్న వికలాంగుల సంక్షేమ శాఖను మాతృ సంస్థలోకి మారుస్తున్నట్టు ప్రకటించారు. సిడబ్ల్యూడి హెల్ప్‌లైన్ 155326తోపాటు పది చేయూత వాహనాలను 33 జిల్లాలకు అందజేస్తామని చెప్పారు. వికలాంగులకు ఉపాధి కోసం ఎంప్లాయిమెంట్ ఎక్స్‌చేంజ్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం పలువురు వికలాంగులను సన్మానించారు. కార్యక్రమంలో దివ్య దేవరాజన్, డైరెక్టర్ శైలజ, వికలాంగుల సంక్షేమ శాఖ కార్పొరేషన్ చైర్మెన్ వాసుదేవ రెడ్డి, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విహార యాత్ర బస్సు బోల్తా

- పలువురు విద్యార్థులకు గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విహార యాత్రకు వెళుతున్న విద్యార్థుల బస్సు బోల్తా పడిన ఘటనలో పలువురు గాయాలపాలయ్యారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో శనివారం ఉదయం జరిగింది. ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన గీతం కళాశాల విద్యార్థులు ఆంధ్రప్రదేశ్‌లోని కడియం విహార యాత్రకు అశ్వారావుపేట మీదుగా ఓ ప్రయివేటు బస్సులో శనివారం ఉదయం బయలుదేరారు. కాగా, అశ్వారావుపేట మండలం పాపిడిగూడెం సమీపంలో బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాద సమయంలో మొత్తం సిబ్బందితో కలిపి 45 మంది బస్సులో ఉన్నారు. సుమారు 15 మంది విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. విద్యార్థులను వెంటనే స్థానిక పిహెచ్‌సికి తరలించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆస్పత్రికి చేరుకొని తమ పిల్లలను తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సాయి కిషోర్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. అందరూ క్షేమంగా బయటపడటంతో ఊపిరి పీల్చుకున్నారు. యాజమాన్యం నుంచి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.

బిజెపి రాజకీయ దాడులను

ధైర్యంగా తిప్పికొడదాం...

- ఎమ్మెల్సీ కవితతో సిఎం కెసిఆర్
- ప్రగతిభవన్‌లో ఆరు గంటలకుపైగా సమావేశం
- ప్రతీది రాత పూర్వకంగానే..
- సిబిఐకి ఎమ్మెల్సీ కవిత స్పష్టీకరణ



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'మీరు నాకు చెప్పాలనుకున్న ప్రతీ విషయం కాగితం మీద రాతల రూపంలోనే ఉండాలి...' అంటూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సిబిఐకి స్పష్టం చేశారు. ఢిల్లీ డిప్యూటీ సిఎం మనీశ్ సిసోడియాకు సంబంధించిన కేసులో... కేంద్ర హోం శాఖ సిబిఐకి చేసిన ఫిర్యాదు కాపీతోపాటు దాని ఆధారంగా నమోదు చేసిన ఎఫ్ఐఆర్ కాపీని తనకు అందించాలంటూ ఆమె కోరారు. ఈ మేరకు శనివారం సిబిఐకి కవిత లేఖ రాశారు. మరోవైపు ఈ తతంగంపై చర్చించేందుకు ఆమె... శనివారం ముఖ్యమంత్రి కెసిఆర్‌తో భేటీ అయ్యారు. ఉదయం 10 గంటలకు ప్రగతి భవన్‌కు వెళ్లిన ఆమె... సాయంత్రం 4.30 గంటల వరకూ తన తండ్రితో పలు అంశాలపై చర్చించారు. ఇడి, సిబిఐ... రాష్ట్ర ప్రభుత్వాన్ని, నేతలను పెడుతున్న ఇబ్బందులపై వారు సమాలోచనలు చేశారు. 'ఎట్టి పరిస్థితుల్లోనూ రాజకీయంగా వెనకడుగేయొద్దు.. ఇదే సమయంలో చట్టపరంగానూ పకడ్బందీగా ఉండాలి. దర్యాప్తు సంస్థలకు, బిజెపికి ఎంతమాత్రమూ అవకాశమివ్వొద్దు...' అంటూ ఆయన కవితకు సూచించారు. బిజెపి రాజకీయ దాడులను ధైర్యంగా తిప్పికొడదామన్నారు. మానసికంగా కుంగిపోతే, భయపడితే బిజెపి మరింత భయపెడుతుందంటూ ఆయన హెచ్చరించారు. 'నేనున్నా.. ఏం కాదు... దర్యాప్తు సందర్భంగా ఎలాంటి భయాందోళనలకు లోనుకావొద్దు...' అంటూ ఆయన తన కూతురికి భరోసానిచ్చినట్టు సమాచారం.

సిఎంతో భేటీ అనంతరం కవిత... సిబిఐకి లేఖ రాశారు. ఆ లేఖ ప్రతిని మీడియాకు విడుదల చేశారు. ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు సంబంధించిన కేసులో క్లారిఫికేషన్ కోసం సిబిఐ ఇచ్చిన నోటీసులపై ఆమె ప్రతిస్పందించారు. క్లారిఫికేషన్ కోసం ఆమె వద్దకు రావాలనుకుంటున్నట్టు సిబిఐ శుక్రవారం కవితకు సమాచారమిచ్చింది. సిఆర్‌పిసి సెక్షన్ 160 నోటీసు ద్వారా సిబిఐ ఈ సమాచారమిచ్చింది. దానిపై కవిత స్పందిస్తూ... శనివారం సిబిఐ అధికారి అలోక్ కుమార్ షాహికి లేఖ రాశారు. సిబిఐకి కేంద్ర హోం శాఖ చేసిన ఫిర్యాదు కాపీతోపాటు దాని ఆధారంగా నమోదు చేసిన ఎఫ్ఐఆర్ కాపీని తనకు అందించాలని కోరారు. సాధ్యమైనంత త్వరగా వాటిని పంపించాలంటూ విజ్ఞప్తి చేశారు.

తొలిమెట్టు 'టాస్క్‌ఫోర్స్'పై సర్కారు వెనక్కి

- ఉత్తర్వులు నిలిపివేత
- విద్యాశాఖ ఆదేశాలు జారీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రాథమిక స్థాయిలో మౌలిక భాషాగణిత సామర్థ్యాల సాధన కార్యక్రమం (ఎఫ్ఎల్ఎన్) తొలిమెట్టు పర్యవేక్షణ కోసం టాస్క్‌ఫోర్స్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను పాఠశాల విద్యాశాఖ నిలిపేసింది. ఈ మేరకు విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన శనివారం ఆదేశాలు జారీ చేశారు. తొలిమెట్టు పర్యవేక్షణ కోసం టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తూ గతనెల 19న ఉత్తర్వులు విడుదల చేసిన విషయం తెలిసిందే. దీనిపై ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఎమ్మెల్సీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకరు లేదా ఇద్దరు ఉపాధ్యాయులున్న పాఠశాలల్లో తొలిమెట్టు కార్యక్రమాన్ని ఎలా అమలు చేయాలంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సర్కారు బడుల్లో మౌలిక వసతులను కల్పించకుండా, సకాలంలో పాఠ్యపుస్తకాలను ఇవ్వకుండా, విద్యావలంటీర్లను నియమించకుండా తొలిమెట్టు కార్యక్రమం అమలు ఎలా సాధ్యమవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ టాస్క్‌ఫోర్స్‌ను తొలగించాలంటూ పలువురు మంత్రులు, విద్యాశాఖ ఉన్నతాధికారులకు వినతిపత్రాలను సమర్పించారు. లేకుంటే ఉద్యమించాల్సి వస్తుందంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని, విద్యాశాఖను హెచ్చరించారు. ఎట్టకేలకు విద్యాశాఖ అధికారులు స్పందించి తొలిమెట్టు అమలు పర్యవేక్షణ కోసం ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్‌ను నిలిపేస్తున్నట్టు ఆదేశాలు జారీ చేశారు.

టాస్క్‌ఫోర్స్ పదాన్ని తొలగించాలి : టిఎస్‌యుటిఎఫ్

తొలిమెట్టు అమలు కోసం ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ పదాన్ని తొలగించాలని టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పర్యవేక్షణ కమిటీలో ఎన్‌జిఒలను తొలగించాలని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టాస్క్‌ఫోర్స్ అనేది పోలీసు వ్యవస్థలో కొనసాగుతున్నదనీ, విద్యావ్యవస్థలోకి తేవడం అభ్యంతరకరమని వివరించారు. పాఠ్యప్రణాళిక స్థానంలో టీచింగ్ నోట్స్‌కు అవకాశమివ్వాలని పేర్కొన్నారు. బోధనేతర పనిభారాన్ని తగ్గించి అవసరమైన చోట విద్యావలంటీర్లను నియమించాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారుల ముందు ఉపాధ్యాయులను పాఠం చెప్పమనే భయానక వాతావరణాన్ని మినహాయించాలని కోరారు. పీరియడ్ పనిభారాన్ని తగ్గించాలని సూచించారు. కనీస సామర్థ్యాలు లేదా సిలబస్ చెప్పాలనే స్పష్టత ఇవ్వాలని తెలిపారు. అభ్యసన సామర్థ్యాల్ని పరీక్షించే సమయంలో కేవలం విద్యార్థులను మాత్రమే పరిశీలించాలని పేర్కొన్నారు. ఎఫ్ఎల్ఎన్ విజయవంతం కోసం ఉపాధ్యాయులపై పనిభారంతోపాటు మానసిక ఆందోళనలు తగ్గించి ప్రశాంత వాతావరణంలో బోధన సాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

టాస్క్‌ఫోర్స్‌ను రద్దు చేయాలి : టిఎస్‌పిటిఎ

ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించడానికి ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ ఉత్తర్వులను నిలిపేయడం సమంజసం కాదనీ, దాన్ని పూర్తిగా రద్దు చేయాలని టిఎస్‌పిటిఎ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ షౌకత్ అలీ, పిట్ల రాజయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అధికారులు క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా, కనీసం ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాలన్న నైతిక బాధ్యతను కూడా విస్మరించారని విమర్శించారు. గడిచిన రెండేండ్లుగా ఇష్టారాజ్యంగా ఉత్తర్వులు జారీ చేసి విద్యాశాఖలో సంక్షోభం సృష్టించాలని చూస్తున్నారని తెలిపారు. విద్యాశాఖ అధికారుల అనాలోచిత నిర్ణయాలపై ముఖ్యమంత్రి కేసీఆర్ జోక్యం చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. టాస్క్‌ఫోర్స్‌ను రద్దు చేయకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఆత్మస్థైర్యంతో లక్ష్యాలను సాధించాలి

- ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా సిఎం కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రపంచంలో సంపూర్ణ మానవుడంటూ ఎవరూ లేడనీ, సమస్యలను అధిగమిస్తూ ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగడం ద్వారానే జీవితానికి పరిపూర్ణత చేకూరుతుందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. 'ప్రపంచ వికలాంగుల దినోత్సవం' సందర్భంగా వికలాంగులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆత్మన్యూనతకు లోనుకాకుండా, ఆత్మస్థైర్యంతో లక్ష్యాలను సాధించాలని వారికి పిలుపునిచ్చారు. ఆసరా అవసరమైన వారికి ప్రభుత్వం అండగా నిలుస్తున్నదనీ, వికలాంగుల సంక్షేమంలో దేశానికి ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. వారికి అందిస్తున్న సేవలపై అత్యుత్తమ రాష్ట్రంగా గుర్తించి కేంద్రం అవార్డులు అందించిన విషయాన్ని సిఎం గుర్తు చేసుకున్నారు. వారి సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధను కనబరిచే ఉద్దేశంతో మహిళా శిశుసంక్షేమ శాఖ నుంచి వికలాంగుల శాఖను స్వతంత్ర విభాగంగా ఏర్పాటు చేశామని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలోని ప్రభుత్వాలు వికలాంగులకు రూ.500 పెన్షన్‌తో సరిపెడితే, స్వరాష్ట్రంలో ఒక కుటుంబంలో ఎంతమంది వికలాంగులుంటే అంతమందికి రూ.3,016 పెన్షన్‌ను అందిస్తూ వారిలో తమ ప్రభుత్వం ఆత్మస్థైర్యాన్ని కలిగిస్తున్నదని తెలిపారు.



సదస్సులో అభివాదం చేస్తున్న నాయకులు

ప్రమాదంలో ప్రభుత్వ విద్యావ్యవస్థ

- భవిష్యత్ పోరాటాలకు విద్యార్థులు సిద్ధం కావాలి
- తెలంగాణ యూత్ డిమాండ్స్ డే సదస్సులో వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ ప్రమాదంలో పడిందని, విద్యార్థులు, యువత భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. విద్యార్థి జన సమితి (విజెఎస్), యువజన సమితి (వైజెఎస్) ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని ఓయూ లైబ్రరీ ఐసిఎస్ఎస్ఆర్ హాల్‌లో తెలంగాణ యూత్ డిమాండ్స్ డే సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు పిసిసి ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డి, ప్రొఫెసర్ కోదండరామ్, ప్రొఫెసర్ హరగోపాల్ హాజరయ్యారు. అంతకుముందు శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తెలంగాణ సమాజానికి ఎంతోమంది మేధావులను అందించిన ఓయూను నిర్వీర్యం చేసేందుకు కుట్ర జరుగుతోందన్నారు. ఏ ఆకాంక్షల కోసం తెలంగాణని సాధించుకున్నామో, అవి నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు యూనివర్సిటీలోకి పోలీసులు వచ్చే పరిస్థితి ఉండేది కాదని, కానీ ప్రస్తుతం హాస్టల్‌లోకి కూడా పోలీసులు వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నవంబర్ 29న శ్రీకాంత్ చారి గురించి మాట్లాడాలే తప్పా, కెసిఆర్ దీక్ష గురించి కాదన్నారు. ఆరేండ్లు అయిన అమరవీరుల స్థూపం పూర్తి కాలేదన్నారు. పేదలకు విద్యను అందించకుండా సిఎం కుట్ర చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే ప్రభుత్వ యూనివర్సిటీల్లో బోధన, బోధనేతర పోస్టులు భర్తీ చేయడం లేదన్నారు. పోరాటాల ద్వారానే ప్రభుత్వ విద్యను సంరక్షణ చేయాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని చెప్పారు. అమరవీరుల స్ఫూర్తిగా విద్యార్థులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వర్‌రావు, సిపిఐ (ఎంఎల్), న్యూడెమోక్రసీ నేత గోవర్ధన్, బైరి రమేష్, వైజెఎస్ అధ్యక్షుడు సలీం పాషా, విజెఎస్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ సర్దార్ వినోద్ కుమార్, స్టేట్ జనరల్ సెక్రటరీ మాసంపల్లి అరుణ్, యూత్ కో ఆర్డినేటర్ కొత్త రవి, స్టేట్ సెక్రటరీ పేరాల ప్రశాంత్, నరేందర్ నకిరేకంటి, జీవన్ రెడ్డి, కార్తీక్ రెడ్డి, జీవన్, గోపి పాల్గొన్నారు.



గాయపడిన వారికి చికిత్స చేస్తున్న వైద్యులు

బొగ్గు గనిలో ప్రమాదం

- ఇద్దరు కార్మికులకు గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొత్తగూడెం సింగరేణి ఏరియా రుద్రంపూర్‌లోని పివికె-5 బొగ్గు గనిలో ప్రమాదం జరిగింది. ఇద్దరు కార్మికులకు గాయాలయ్యాయి. శనివారం గని లోపల మొదటి షిఫ్ట్ 11 గంటల ప్రాంతంలో 108 లెవల్‌లో ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్‌లో పని చేస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. మైన్‌రూఫ్‌పై నుంచి పెద్ద బొగ్గు పెల్ల పడి ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఇందులో వెల్డర్‌గా పనిచేస్తున్న వినోద్ ఎడమ కాలు విరిగింది. జనరల్ మజ్దూర్ హెల్పర్‌గా పనిచేస్తున్న శంషుద్దీన్ గాయపడ్డాడు. ప్రమాదం జరిగిన వెంటనే మైన్ అధికారులకు సమాచారం అందించి క్షతగాత్రులను కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన హాస్పిటల్‌కు తరలించారు. క్షతగాత్రులను మైన్ మేనేజర్ పి.శ్రీనివాసరావు ఆస్పత్రిలో పరామర్శించి, మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి వైద్యులకు సూచించారు. ఎలాంటి ప్రాణాపాయం లేదని, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తున్నామని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ప్రమాదం జరిగిన వెంటనే వివిధ కార్మిక సంఘాల నాయకులు ఆస్పత్రికి చేరుకొని వారి పరిస్థితి గురించి ఆరా తీశారు



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

భూ తగాదాలతో తమ్ముడి దారుణ హత్య

- అన్న భార్య, కొడుకు దాడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భూతగాదాల విషయంలో అన్న తమ్ముళ్ల మధ్య గొడవ జరిగి ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా దోమ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దోమ మండలం కొండాయపల్లి గ్రామానికి చెందిన నెత్తి నర్సింహులు(35), బాల్‌రాజ్ ఇద్దరు అన్నతమ్ముళ్లు. అయితే కొన్నేండ్లుగా వీరిద్దరి మధ్య భూ తగాదాలు తలెత్తాయి. పది రోజుల కిందట వారి తల్లిపేరుపై ఉన్న 13 గుంటల భూమిని ఇతరులకు రూ.7,47,500లకు విక్రయాలు జరిపారు. సదరు వ్యక్తులు అడ్వాన్స్ కింద రూ. 2 లక్షలు ఇవ్వగా, బాల్‌రాజ్ రూ.1.80 లక్షలు తీసుకొని తమ్ముడు నర్సింహులుకు రూ.20 వేలు ఇచ్చాడు. దాంతో వారి మధ్య గొడవ ప్రారంభమయింది. అంతేకాకుండా, భూమి అమ్మగా వచ్చిన డబ్బుల్లో నుంచి చెల్లెలికి ఇవ్వాలని నర్సింహులు, బాలరాజ్‌ను అడగడంతో గొడవ మరింత రాజుకుంది. మాట, మాట పెరిగి గొడ్డలి, కర్రలతో దాడి చేసుకునేంత వరకూ వెళ్లింది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలైనప్పటికీ గ్రామస్తుల చొరవతో ఇద్దరిని విడగొట్టారు. కాగా, కొడంగల్లో ఉంటున్న బాల్‌రాజ్ భార్య సునీత, కుమారుడు హరికి తమ్ముడితో గొడవ జరిగిందని బాల్‌రాజ్ సమాచారం అందించాడు. సమాచారం తెలుసుకున్న వారు కోపోద్రిక్తులై గ్రామానికి తిరిగి వచ్చి.. ఇంట్లో నిద్రిస్తున్న నర్సింహులుపై రోకలితో తలపై మోది దాడి చేశారు. ఈ క్రమంలో నర్సింహులు అక్కడికక్కడే మృతి చెందాడు. హత్య విషయాన్ని తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమారం నిమిత్తం మృతదేహాన్ని పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని బావ బాబయ్య ఇచ్చిన ఫిర్యాదు పోలీసులు కేసు నమోదు చేశారు. పరిగి డిఎస్‌పి కరుణసాగర్‌రెడ్డి, సిఐ వెంకటరామయ్య, ఎస్ఐ విశ్వజన్ హత్యకు గల కారణాలను అరా తీశారు. నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సృజనాత్మకత పెరిగేలా ప్రదర్శనలు ఉండాలి

- టి-హబ్ ద్వారా నూతన ఆవిష్కరణలకు తోడ్పాటు
- వైజ్ఞానిక ప్రదర్శనలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సబితాఇంద్రారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యార్థులు తమలో ఉన్న సృజనాత్మకతను పెంచుకునేందుకు విజ్ఞాన ప్రదర్శన పోటీలను వినియోగించుకోవాలని, ఒకరి ఆలోచనలు ఇతరులు తెలుసుకోవడం వల్ల జ్ఞాన సంపద పెరుగుతుందని విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి అన్నారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మాంటిస్సోరీ పాఠశాలలో జిల్లా స్థాయి విజ్ఞానిక ప్రదర్శన పోటీల్లో టిఎస్ఎంఐ డబ్ల్యుసి చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి, పాఠశాల విద్యా సంచాలకులు దేవసేన, వరంగల్ ఎంపి పసునూరి దయాకర్, జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, భూపాలపల్లి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డితో కలిసి ఆమె పాల్గొన్నారు. మంత్రి ముందుగా సరస్వతిదేవి, సివి రామన్, శ్రీనివాస రామానుజన్‌ల చిత్రపటాలకు పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విజ్ఞాన ప్రదర్శనలో పాల్గొంటున్న విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. భూపాలపల్లి జిల్లాలో సిఎస్ఆర్ నిధుల ద్వారా 10 పాఠశాలల్లో డిజిటల్ తరగతులు, నైపుణ్యత గల 17 విద్యార్థులకు ఐఐటి/నీట్ శిక్షణ కోసం ట్యాబ్‌ల పంపిణీ మొదలైన కార్యక్రమాలు చేపట్టిన జిల్లా కలెక్టర్‌ను ఈ సందర్భంగా ప్రశంసించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి సమాజంలో ఉన్నతస్థాయికి ఎదిగిన వారు తమ గ్రామంలో పాఠశాల అభివృద్ధికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ఉన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు నూతన ఆవిష్కరణలవైపు ఆలోచించేలా ప్రోత్సహించాలని సూచించారు. మన ఊరు - మనబడి కార్యక్రమం ద్వారా మౌలిక సదుపాయాల కల్పన, పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమ విద్య బోధన చేపట్టి పేద ప్రజలకు నాణ్యమైన విద్య అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు మంత్రి కెటిఆర్ టి-హబ్ ఏర్పాటు చేశారని, దాని ద్వారా నూతన ఆవిష్కరణలతో వచ్చేవారికి పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు అవసరమైన తోడ్పాటు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యను ప్రోత్సహించేందుకు గురుకులాలు, కేజీబీవీ, మాడల్ పాఠశాలలు మొదలుకొని 1700 హాస్టల్ వసతితో విద్యా సంస్థలను ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. పేద ప్రజలు 10వ తరగతితో చదువు నిలిపివేయద్దన్న ఉద్దేశంతో సీఎం కేసీఆర్ 1150 రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఇంటర్మీడియట్ ప్రవేశపెట్టారని, అదే విధంగా డిగ్రీ, పీజీ కళాశాలలు, ప్రత్యేక న్యాయ కళాశాలలు ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ దివాకర్, టీఎస్ డబ్ల్యూఐ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ శ్రీ హర్షిని, డీఈవో రాజేందర్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

ఎన్ఇపి అమలుతో మహిళలు విద్యకు దూరం

- దేశంలో అసమానతలు పెరిగే ప్రమాదం
- ఎస్ఎఫ్ఐ సెమినార్‌లో ప్రొఫెసర్ నాగేశ్వరరావు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నూతన విద్యావిధానం (ఎన్ఈపీ)ని అమలు చేయడం వల్ల మహిళలు విద్యకు దూరమయ్యే ప్రమాదముందని ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ) ప్రొఫెసర్ ఆమంచి నాగేశ్వర్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యరంగంలో అసమానతలు పెరిగే ప్రమాదముందని విమర్శించారు. దేశంలో డ్రాపౌట్స్ పెరుగుతారనీ, పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని చెప్పారు. ఎస్ఎఫ్ఐ అఖిల భారత మహాసభను పురస్కరించుకుని శనివారం హైదరాబాద్ కోఠిలోని తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంలో 'నూతన విద్యావిధానం-మహిళల విద్య'అనే అంశంపై సెమినార్‌ను నిర్వహించారు. ఆ సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు లెనిన్ గువేరా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. దేశంలో ఇప్పటికే విద్యారంగంలో అసమానతలు పెరిగాయని అన్నారు. ఎన్ఈపీ అమలుతో పాఠశాలలు విలీనమవుతాయనీ, మహిళల విద్య కుంటుపడుతుందని వివరించారు. దేశంలో పురుషుల అక్షరాస్యత 82.4 శాతం ఉంటే, మహిళల అక్షరాస్యత 65.8 శాతం ఉందని చెప్పారు. నూతన విద్యావిధానం అమలైతే మహిళలు మరింత నష్టపోతారనీ, విద్యకు దూరమవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో మహిళలకు భద్రత కరువైందన్నారు. గుజరాత్‌లో బిల్కిస్ బానోపై లైంగిక దాడికి పాల్పడిన నిందితులను విడుదల చేయడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. ఎన్ఈపీ అమల్లోకి వస్తే విద్యారంగంలో అసమానతలు మరింత పెరుగుతాయని చెప్పారు. ఇంకోవైపు ఉన్నత విద్యకు పేద విద్యార్థులు దూరమయ్యే ప్రమాదముందన్నారు. విద్యారంగానికి కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనివ్వాలనీ, నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. మహిళలు ఎక్కువ మంది ఉన్నత విద్యను అభ్యసించేలా కేంద్రం ప్రోత్సహించాలని కోరారు. విద్యారంగంలో అసమానతలు, వివక్షకు వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి మాట్లడుతూ.. రాష్ట్రంలో మహిళా విశ్వవిద్యాలయానికి సరిపోయినన్ని నిధులు కేటాయించి సమస్యలను పరిష్కారం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళలను ఉన్నత విద్యకు దూరం చేసే నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలని కేంద్రాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా జిల్లా ఉపాధ్యక్షుడు వీరేందర్, సభ్యులు చరణ్ శ్రీ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సాహిత్యం విస్తృతంగా వెలువడాలి

- తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీ శంకర్

ప్రజాశక్తి-కల్చరల్

తెలుగు సాహిత్యంలో గిరిజన, ఆదివాసీయుల జీవన విధానం, సంస్కృతి, కళలు ఎక్కువగా నమోదు కాలేదని, భవిష్యత్తు తరాల కోసమైనా వారి సాహిత్యం విస్తృతంగా వెలువడాలని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీ శంకర్ అన్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి సమావేశ మందిరంలో డాక్టర్ సూర్య ధనంజయ, రమేష్ కార్తీనాయక్ సంపాదకత్వంలో వెలువడిన 'కేసులా' గ్రంథ పరిచయ సభ శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనులు మూలికా వైద్యులుగా, అటవీ సంరక్షకులుగా, పర్యావరణ పరిరక్షకులుగా, భూమికోసం పోరాటం చేసిన యోధులుగా చరిత్రలో ప్రసిద్ధులని తెలిపారు. అందుకే వారి సాంస్కృతిక, ఆర్థిక, సామాజిక జీవనాన్ని అధ్యయనం చేయల్సిన అవసరం ఉందన్నారు. సాహిత్య అకాడమీ నిర్వహణలో ఆదివాసీ గిరిజన సాహిత్య శిక్షణా శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. గిరిజన మౌఖిక సాహిత్యాన్ని సేకరించేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. గ్రంథాలయ పరిషత్ చైర్మెన్ ఆయాచితం శ్రీధర్ మాట్లాడుతూ.. గిరిజన సాహిత్యం ఇతర భాషల్లో అనువాదం కావాలని, ఈ పని సాహిత్య అకాడమీ చేపట్టాలని కోరారు. సెంట్రల్ యూనివర్సిటీ తెలుగుశాఖ అధిపతి పిల్లలమర్రి రాములు మాట్లాడుతూ.. సాహిత్య అకాడమీ ఆగాధలు దాటి గిరిజన గడప వద్దకు రావటం గొప్ప పరిణామమన్నారు. కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సిబిఐ కోర్టు విచారణకు హాజరవ్వండి

- 'ఇందూ' శ్యాంప్రసాద్‌రెడ్డికి హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వైఎస్ జగన్ ఆస్తులపై సిబిఐ నమోదు చేసిన చార్జిషీట్‌పై సిబిఐ కోర్టు విచారణకు ఇందూ శ్యాంప్రసాద్‌రెడ్డి హాజరుకావాలని హైకోర్టు తీర్పు వెలువరించింది. వ్యక్తిగత విచారణకు హాజరు కాకుండా మినహాయింపు కోరుతూ ఆయన దాఖలు చేసిన రిట్‌ను చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్ కొట్టేస్తూఉత్తర్వులు జారీ చేశారు. ఏమైనా పనులుంటే సిబిఐ కోర్టు అనుమతి పొందవచ్చునని చెప్పారు. ఎస్‌పిఆర్ ప్రాపర్టీస్ ప్రయివేట్ లిమిటెడ్, భూమి రియల్ ఎస్టేట్స్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రయివేట్ లిమిటెడ్, ఇందూ టెక్ జోన్, ఇందూ ప్రాజెక్ట్స్ వేసిన రిట్లను కూడా కొట్టేశారు. అనంతపురం జిల్లా లేపాక్షిలో నాలెడ్జి హబ్ కోసం వైఎస్ సర్కార్ ఇచ్చిన సుమారు తొమ్మిది వేల ఎకరాలపై రుణం తీసుకుని, వేరే కంపెనీలకు మళ్లించారనే సిబిఐ కేసులో ఆ కోర్టు విచారణకు హాజరుకావాలని చెప్పారు.

ప్రమాదాలను నివారించండి

- ఆర్‌టిసి డ్రైవర్లకు చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ విజ్ఞప్తి

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

చలికాలం ఉష్ణోగ్రతలు పడిపోతున్న సందర్భంగా రోడ్డుపైన దట్టంగా పొగ మంచు కురుస్తున్నదనీ, ఆర్‌టిసి డ్రైవర్లు విధి నిర్వహణలో ఏమాత్రం అలసత్వం వహించకుండా చాకచక్యంగా వ్యవహరించాలని టిఎస్‌ఆర్‌టిసి చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. ఈ సందర్భంగా డ్రైవర్లకు ఉపయోగపడే భద్రతా సూత్రాలను ఆయన ప్రకటించారు. హైవే, ఫారెస్ట్ రోడ్డు, నగర శివారు ప్రాంతాల్లో వేగనియంత్రణ పాటించాలనీ, ప్రమాదకరమైన జంక్షన్లు, మలుపుల వద్ద ఇండికేటర్‌ను ఉపయోగించాలని చెప్పారు. ముందు వెళ్ళే వాహనంతో సురక్షిత దూరాన్ని పాటించాలనీ, పొగ మంచు ఉన్నచోట హారన్, లైట్లు, వైపర్ వాడాలంటూ పలు సూచనలు చేశారు.

ఓటమిలోనే గెలుపు ఉంది

- జనసేన అధినేత పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



పరాజయాల గురించి నిర్భయంగా చర్చించుకోవాలని, ఓటమిలోనే గెలుపు ఉందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. తాను పరాజయం పొందిన రాజకీయ నాయకుడినని, ఓడిపోయానని చెప్పుకోవడానికి ఏ మాత్రం మొహమాటపడనని చెప్పారు. హైదరాబాద్ శిల్పకళా వేదికలో శనివారం జరిగిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంట్ ఆఫ్ ఇండియా సదస్సులో పవన్ పాల్గొన్నారు. 'ఫేసింగ్ ది ఫ్యూచర్' అనే అంశంపై సిఎ విద్యార్థులనుద్దేశించి పవన్ కల్యాణ్ ప్రసంగించారు. తన పరాజయాల గురించి నిర్భయంగా బహిరంగంగానే మాట్లాడుతానని తెలిపారు. డబ్బున్న వాళ్లంతా గొప్పోళ్లు, పేరున్న వాళ్లంతా మహానుభావులు అనుకోవద్దని సూచించారు. దేవుడితో సహా ఎవరినీ కూడా గుడ్డిగా నమ్మొద్దని అన్నారు. ఏది ఒప్పు, ఏది తప్పు అనే విచక్షణా జ్ఞానం ప్రతి ఒక్కరం కలిగి ఉండాలన్నారు. మన వ్యక్తిగత విజయమే దేశానికి పెట్టుబడి అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

పాలమూరులో అమానుషం

- బాలికపై సామూహిక లైంగికదాడి.. హత్య!
- న్యాయం చేయాలంటూ మృతదేహంతో రాస్తారోకో
- రెండు తండాల్లో ఉద్రిక్తత



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహబూబ్‌నగర్ జిల్లాలో దారుణ ఘటన జరిగింది. తండ్రి తర్వాత తండ్రి అంతటి చిన్నాన్నే తన స్నేహితులతో కలిసి బాలికపై లైంగికదాడి చేసి.. ఆపై హత్య చేశారు. న్యాయం చేయాలంటూ బాధిత కుటుంబీకులు శనివారం జడ్చర్ల మండల కేంద్రంలోని నేతాజీ చౌరస్తారో బాలిక మృతదేహంతో ఆందోళన చేశారు. ఈ ఘటనకు కారణమైన ముగ్గురు నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం తిరుమలగిరి గ్రామపంచాయతీ పరిధిలోని ఓ తండాలో జరిగింది. బాధితులు, ఎస్ఐ జయప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం..

తిరుమలగిరి గ్రామపంచాయతీ పరిధిలోని కేశవతండాకు చెందిన బాలిక(16) తల్లిదండ్రులు శుక్రవారం పనిపై హైదరాబాద్ వెళ్లి.. ఆలస్యం కావడంతో అక్కడే ఉండిపోయారు. దాంతో రాత్రి ఇంట్లో బాలిక ఒంటరిగా ఉంది. ఆ సమయంలో బంధువు.. వరుసకు బాబాయి అయిన శ్రీనునాయక్, చిన్న రేవల్లికి చెందిన అతని స్నేహితులు ఇంట్లోకి వచ్చి మద్యం తాగారు. అనంతరం బాలికపై లైంగికదాడికి ఒడిగట్టారు.. ఆ తర్వాత హత్య చేశారు. శనివారం ఉదయం తల్లిదండ్రులు వచ్చేసరికే విగతజీవిగా ఉన్న కూతురును చూసి వారు గుండెలవిసేలా రోదించారు. శ్రీనునాయక్, అతని స్నేహితులైన చిన్నరేవల్లికి చెందిన శివ, శ్రీనులే ఘాతుకానికి ఒడిగట్టారని బాలిక కుటుంబీకులు, బంధువులు వారి ఇళ్లపై దాడి చేశారు. చిన్నరేవల్లిలో శివ టీవీ రిపేర్ షాపులో సామగ్రిని ధ్వంసం చేశారు. కేశవతండాలో శ్రీనునాయక్ ఇంటిని కూడా ధ్వంసం చేశారు. ద్విచక్ర వాహనం, కిరాణాషాపును తగలబెట్టారు. దాంతో రెండు తండాల్లో తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న బాలానగర్ ఎస్ఐ జయప్రసాద్, జడ్చర్ల రూరల్ సీఐ జంబులప్ప ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి, బాలిక మృతదేహాన్ని జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం శనివారం సాయంత్రం జడ్చర్ల పట్టణంలోని నేతాజీ చౌరస్తాలో మృతదేహాన్ని పెట్టి దాదాపు రెండు గంటలకు పైగా బాధితులు రాస్తారోకో చేశారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి: ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

బాలికపై లైంగికదాడి, హత్య విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి జడ్చర్ల ప్రభుత్వాస్పత్రికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి సంఘటనలు దురదృష్టకరమని, నిందితులను కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఇ-అభ్యాస్‌ను స్వాధీనం చేసుకున్న మూడుల్

- మంత్రి కెటిఆర్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో ప్రవేశించేందుకు వీలుగా ప్రపంచ ప్రముఖ లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ మూడుల్ ఎడ్యుకేషన్ టెక్‌కు సంబంధించిన అంకుర సంస్థ ఇ-అభ్యాస్‌ను స్వాధీనం చేసుకున్నది. రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కె.తారకరామారావు శుభాకాంక్షలు తెలిపారు. ఆన్‌లైన్‌లో లెర్నింగ్‌తో ఇంటర్నెట్ వినియోగం పెరిగిందనీ, ఇప్పుడు మూడుల్ రాకతో డిజిటల్ లెర్నింగ్‌లో అది కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. మూడుల్ రాకతో భారతీయ వినియోగదారులు సైతం నేరుగా సేవలు పొందేందుకు వెసులుబాటు కలిగింది.

రాబోయే రెండేండ్లలో మూడుల్ సంస్థ నాలుగు వందల మందికి తీసుకోనున్నది. ఈ సందర్భంగా ఆ సంస్థ సీఎఫ్ఓ రోహన్ హార్డీ, మెర్జర్స్ అండ్ అక్విజేషన్ హెడ్ నిక్ రేనాల్డ్స్ మాట్లాడుతూ.. ఇటీవల యుఎస్ఏ ఫర్మ్‌ను స్వాధీనం చేసుకున్నామనీ, ఇండియన్ ఇ-అభ్యాస్‌తో ప్రపంచవ్యాప్తంగా మెరుగైన సేవలందించగలుగుతామని ఆశాభావం వ్యక్తం చేశారు.వ్యవస్థాపక సిఇఓ మార్టిన్ డౌగియమస్ మాట్లాడుతూ.. భారత దేశంలో ఆన్‌లైన్ లెర్నింగ్‌కు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. ఇ-అభ్యాస్ సిఇఓ సుశీల్ మాట్లాడుతూ.. మూడుల్ సేవలను దేశవ్యాప్త ఇ-లెర్నింగ్ మార్కెట్‌లో పెంచేందుకు ఈ చర్య దోహదం చేస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

నేడు టియుఎంహెచ్‌ఇయు రాష్ట్ర మహాసభ

- జయప్రదానికి నేతల పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టియుఎం అండ్‌హెచ్‌యు) రాష్ట్ర మూడో మహాసభ ఆదివారం ఉదయం 11 గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రారంభం కానుంది. ఈ మేరకు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు భూపాల్, ప్రధాన కార్యదర్శి కె.యాదానాయక్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ మహాసభకు రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల నుంచి 250 మంది ప్రతినిధులు హాజరు కానున్నారు. వైద్యారోగ్యశాఖలో పని చేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటించనున్నట్టు వారు తెలిపారు. 102, 104, 108 ఉద్యోగులు, అర్బన్ హెల్త్ సెంటర్లు, ఆయుష్, వైద్యవిద్య, వైద్య విధాన పరిషత్ ఉద్యోగులు, ఆరోగ్య మిత్రాలు, నర్సింగ్ సిబ్బంది, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న కాంటింజెంట్ వర్కర్ల సమస్యలు, నేషనల్ హెల్త్ మిషన్, తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, ఆర్ఎన్‌టిపిసి సమస్యలతో పాటు అన్ని స్కీమ్‌లలో పని చేస్తున్న ఉద్యోగుల డిమాండ్లపై కూలంకషంగా చర్చించి తీర్మానాలను ఆమోదిస్తామని తెలిపారు. సమస్యల పరిష్కారానికి భవిష్యత్‌లో నిర్వహించే దశల వారి ఆందోళన, పోరాటాల కార్యక్రమాలను రూపొందించుకోనున్నట్టు వివరించారు. ఈ మహాసభకు రాష్ట్ర వ్యాప్తంగా వైద్యారోగ్యశాఖలో పని చేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరు విచ్చేసి మహాసభను జయప్రదం చేయాలని కోరారు.

కార్పొరేట్‌కు సింగరేణా...?

- కేంద్రం కుట్రలకు వ్యతిరేకంగా నిరసన



ర్యాలీలో పాల్గొన్న సింగరేణి కార్మికులు, స్థానిక ప్రజలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సిసిఎల్)ను ప్రైవేటీకరించమని చెబుతూ మరోపక్క వేలంపాట ముసుగులో కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేలా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆరోపించారు. కేంద్ర విధానాలకు వ్యతిరేఖంగా శనివారం సత్తుపల్లిలో సింగరేణి కార్మికులు, స్థానిక ప్రజలతో కలిసి భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సండ్ర మాట్లాడుతూ.. సింగరేణిని ప్రైవేటుకు అప్పగించే ఎటువంటి నిర్ణయాన్ని అంగీకరించే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు. తెలంగాణలో నాలుగు కోల్ బ్లాక్‌లను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నం జరుగుతోందని, దాన్ని వెంటనే విరమించుకోవాలని ఆయన కేంద్రాన్ని డిమాండ్ చేశారు. బిజెపి సర్కారు ప్రభుత్వ రంగ సంస్థలను తెగనమ్మి పేదల కడుపుకొడుతూ బడా వ్యాపారులకు మేలు చేస్తోందని విమర్శించారు. సింగరేణి సంస్థకు రైతులు తమ విలువైన భూములు ఇచ్చారని, వాటిని ప్రైవేటుకు కట్టబెడితే సహించేదిలేదన్నారు. సింగరేణి సంస్థ ప్రభుత్వ రంగంలో ఉంటేనే రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి జరుగుతుందని, పేద వర్గాలైన ఎస్‌సి, ఎస్‌టి, బిసి వర్గాలకు మేలు జరుగుతుందని సండ్ర తెలిపారు. నిరసన కార్యక్రమంలో పెద్దఎత్తున యువత పాల్గొన్నారు.

గుత్తికోయలపై దుష్ప్రచారం తగదు..

- ఆదివాసీ,అటవీ హక్కుల పరిరక్షణ సమన్వయ కమిటీ
- మంత్రి సత్యవతిరాథోడ్‌కు వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గుత్తి కోయలపై పోలీసు, అటవీ అధికారులు దుర్మార్గమైన దుష్ప్రచారం చేస్తున్నారనీ, ఎర్రబోడు గ్రామం నుండి వారిని ఖాళీ చేయించాలనే ప్రయత్నంలో భాగంగా నోటీసులు జారీ చేయడాన్ని వెనక్కు తీసుకోవాలని ఆదివాసీ, అటవీ హక్కుల పరిరక్షణ సమన్వయ కమిటీ నేతలు శనివారం హైదరాబాద్‌లో మంత్రి సత్యవతి రాథోడ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుత్తి కోయలతో సహా, ఆదివాసులు ఇతర పారంపర్య భూములను సాగు చేసుకున్న వారికి వచ్చే ఆర్నెల్లలోపు హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గుత్తి కోయలు నివసిస్తున్న గ్రామాల నుండి వారిని పంపించకుండా చర్యలు తీసుకుంటామనీ, వారి నుంచి దరఖాస్తులు కూడా స్వీకరించామని తెలిపారు. వినతి పత్రం సమర్పించిన వారిలో కమిటీ కన్వీనర్ వేములపల్లి వెంకట్రామయ్యతోపాటు గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం ధర్మానాయక్, రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి మండల వెంకన్న, ప్రజాపంథా నాయకులు వి ప్రభాకర్, ప్రసాదన్న, తుకారం నాయక్‌లు ఉన్నారు.

జోరుగా ధాన్యం సేకరణ

- మంత్రి గంగుల కమలాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో వానాకాలం ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగుతున్నదని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని మంత్రుల నివాస సముదాయంలో పౌరసరఫరాలశాఖ కమిషనర్ వి.అనిల్ కుమార్, ఇతర ఉన్నతాధికారులతో మంత్రి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. గత సంవత్సరం కన్నా ఈ ఏడాది 10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అధికంగా సేకరించినట్టు తెలిపారు. వ్యవసాయ అనుకూల విధానాలు, పుష్కలమైన నీటితో రాష్ట్రంలో ధాన్యం నాణ్యత మరింత పెరిగిందని చెప్పారు. ప్రయివేటులో సైతం మద్దతు ధర కన్నా అధికంగా ధర రావడం మంచి పరిణామమని అన్నారు. ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. 6,734 కొనుగోలు కేంద్రాల ద్వారా నిన్నటివరకూ 6.42 లక్షల మంది రైతుల నుంచి 38.06 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని వివరించారు. ఇందులో 36.87 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు తరలించామనీ, వీటి విలువ రూ. 7,837 కోట్లని తెలిపారు. రైతులకు ఇప్పటి వరకు రూ.4,780 కోట్లు చెల్లించామని తెలిపారు. 9.52 లక్షల గన్నీలు వాడమనీ, ఇంకా 9.16లక్షల గన్నీలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 729 కేంద్రాల్లో ప్రక్రియ పూర్తయినట్టు వెల్లడించారు. కొనుగోలు కేంద్రాల్లో ప్యాడీక్లీనర్లు, మాయిశ్చర్ మిషన్లు, టార్పాలిన్లు తదితర అన్ని మౌలిక వసతులు సమకూర్చామని చెప్పారు. రైతులు ఎఫ్‌ఏక్యూతో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని మంత్రి సూచించారు.



వికలాంగులకు ఏదైనా సాధ్యమే

- ఎస్‌బిఐ హెడ్ బ్రాంచ్ జనరల్ మేనేజర్ మంజూ శర్మ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వికలాంగులు తలచుకుంటే సాధ్యం కానిది ఏదీ లేదని, అభివృద్ధిలో భాగస్వాములు కాగలరని ఎస్‌బిఐ హెడ్ బ్రాంచ్ జనరల్ మేనేజర్ మంజు శర్మ అన్నారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం హైదరాబాద్, కోఠిలోని ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచ్‌లో వికలాంగులైన బ్యాంక్ సిబ్బందికి, కస్టమర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంజు శర్మ మాట్లాడుతూ... వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఎస్‌బిఐ సిబ్బందిని సత్కరించిన స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానని చెప్పారు. ఈ ఫౌండేషన్ వారు ప్రత్యేకించి వికలాంగుల కోసం పనిచేయడం అభినందనీయమన్నారు. వికలాంగుల పనితీరుపై వారు అనేక సందర్భాల్లో అధ్యయనం చేసి, వారు కూడా ఎందులోనైనా రాణించగలరని తేల్చారన్నారు. వికలాంగులను నేడు తక్కువ చేసి చూడాల్సిన అవసరం లేదని, అన్ని అవయవాలు సక్రమంగా ఉన్నవారితో సమానంగా వారు సమాజంలో ఆయా రంగాల్లో రాణిస్తున్నారని, తమ సామర్థ్యాన్ని నిరూపించుకుంటున్నారని చెప్పారు. వికలాంగుల నుంచి కూడా మనం నేర్చుకోవాల్సింది ఎంతో ఉందన్నారు. డిప్యూటీ జనరల్ మేనేజర్ అండ్ సిడిఓ జితేందర్ కుమార్ మాట్లాడుతూ.. ఎస్‌బిఐలో ఉన్న వికలాంగులైన సిబ్బంది ఎంతో మంచిగా, సమర్థవంతంగా పనిచేస్తున్నారని, వారిని చూసి తానే ఆశ్చర్య పడుతుంటానని చెప్పారు. బ్యాంకు సంబంధిత కార్యక్రమాల్లోనూ వారు చురుకుగా పాల్గొని ప్రతిభ చాటుతుంటారని చెప్పారు. అంతేకాదు, వారు ఎప్పటికప్పుడు బ్యాంకింగ్ విషయంలో అప్‌డేట్‌గా ఉంటూ తోటి సిబ్బందికి, కస్టమర్లకు తాజా సమాచారాన్ని అందించడంలోనూ ముందుంటున్నారని తెలిపారు. ఎస్‌బిఐ వికలాంగులైన ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం (హ్యూమన్ రిసోర్స్), ఏజీఆర్ (లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్), ఏజీఎం (మార్కెటింగ్ అండ్ కమ్యూనికేషన్), ఏజీఎం (బ్యాంకింగ్ అంబుడ్స్‌మెన్), తదితరులు పాల్గొన్నారు.



మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

అమరవీరుల జ్యోతి యాత్రను జయప్రదం చేయండి

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి
- జాతీయ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని కడివెండి నుంచి కేరళ రాష్ట్రంలోని త్రిసూర్ వరకు వెళ్లనున్న అమరవీరుల జ్యోతియాత్రను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. అఖిల భారత్ కిసాన్ సభ (ఎఐకెఎస్) 35వ జాతీయ మహాసభ పోస్టర్‌ను శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమురయ్య భవనంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 13-16వ తేదీల్లో కేరళ రాష్ట్రంలోని త్రిసూర్‌లో జాతీయ మహాసభ జరగనుందని, ఈ క్రమంలో దేశంలోని రెండు ప్రాంతాల నుంచి అమరవీరుల జ్యోతి యాత్ర బయల్దేరుతుందని చెప్పారు. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, పాలకులు అనుసరిస్తున్న విధానాలు ప్రజలకు వివరించేందుకు ఈ యాత్రలు నిర్వహిస్తున్నారని తెలిపారు. మొదటి యాత్ర ఈ నెల 5న వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య స్వగ్రామమైన కడివెండిలో ఉదయం ప్రారంభమవుతుందన్నారు.

మొదటి యాత్రకు ఎఐకెఎస్ సహాయ కార్యదర్శి కృష్ణప్రసాద్, కేంద్ర కమిటీ సభ్యులు టి.సాగర్ నాయకత్వం వహిస్తారని చెప్పారు. ఈ యాత్ర కడివెండి నుంచి బయలుదేరి మధ్యాహ్నం ఒంటి గంటకు రామన్నపేటకు వస్తుందన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు గుండ్రాంపల్లికి, 3:30కి నల్లగొండకు చేరుకొని గడియారం సెంటర్‌లో సభ ఉంటుందన్నారు.

అక్కడి నుంచి 5.30 గంటలకు మిర్యాలగూడకు వెళ్తుందని, అక్కడ సభ అనంతరం ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర నాయకులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, బండ శ్రీశైలం, కూన్‌రెడ్డి నాగిరెడ్డి, కందాల ప్రమీల, ఐతరాజు నర్సింహ, నన్నూరి వెంకట రమణారెడ్డి, సయ్యద్‌హాషం, ఎండీ.సలీం, ముత్యాలు, మధుసూదన్‌రెడ్డి, బీ.రవీందర్, నర్సింహ, జోకుల నర్సింహయ్య తదితరులు పాల్గొన్నారు.

జఠిలంగా 'నారాయణపూర్' గండి సమస్య

- పూడ్చొద్దంటున్న నిర్వాసితులు..
- సాగునీరు కావాలంటున్న రైతులు
- 'కాళేశ్వరం' నీళ్లు రావాలంటే ఈ రిజర్వాయరే దిక్కు!
- గండి పూడ్చకపోతే 1.65 లక్షల ఎకరాల్లో సాగు ప్రశ్నార్థకం
- ఆందోళనలో కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల రైతాంగం
- పరిష్కరించకపోతే ఎండాకాలం తాగునీటికి ఇక్కట్లే.. !



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నారాయణపూర్ రిజర్వాయర్ సమస్య జఠిలంగా మారింది. మొన్నటి భారీ వర్షాలకు రిజర్వాయర్‌కు గండి పడి చుక్కనీరు లేకుండా పోయింది. యాసంగికి సాగు నీరందించేందుకు గండి పూడ్చాలని ఆయకట్టు రైతులు ఆందోళన చేస్తుండగా.. మరోవైపు పరిహారం విషయం తేల్చేవరకు మరమ్మతులు చేపట్టొద్దని ముంపు గ్రామాల ప్రజలు భీష్మించుకూర్చున్నారు. కాళేశ్వరం నీళ్లు రావాలంటే ఈ రిజర్వాయరే దిక్కు. గండి పూడ్చకపోతే 1.65 లక్షల ఎకరాల సాగు ప్రశ్నార్థకం కానుంది. తాగునీటికీ ఇక్కట్లు ఏర్పడనున్నాయి.

కరీంనగర్, రాజన్నసిరిసిల్ల, జగిత్యాల జిల్లాల పరిధిలోని సుమారు 1.65లక్షల ఎకరాల సాగుకు చొప్పదండి నియోజకవర్గంలోని నారాయణపూర్ రిజర్వాయరే దిక్కు!. కాళేశ్వరం నుంచి ఎత్తిపోసిన నీటిని ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా ఈ రిజర్వాయర్‌కు పంపింగ్ చేసి యాంసంగికి నీళ్లందిస్తున్నారు. గతంలోనే రిజర్వాయర్ కట్టను 1.4మీటర్ల ఎత్తుకు పెంచి 0.3 టిఎంసిల అదనపు నీటిని నిల్వ చేసేందుకు సర్కారు రూ.24.10కోట్లు మంజూరు చేసింది. అయితే, కట్ట పెరగడంతో ముంపునకు గురవుతున్న నిర్వాసితులకు పరిహారం అందించలేదు. సరికదా.. ఈ రిజర్వాయర్‌కు మొన్నటి భారీ వర్షాలకు గండి పడి సుమారు ఐదారు ఊర్లు నీటమునిగాయి. కట్టుబట్టలతో జనం పునరావాస కేంద్రాల్లో బిక్కుబిక్కుమంటూ గడిపారు. గండి వల్ల ప్రస్తుతం రిజర్వాయర్‌లో చుక్కనీరు లేదు. ఇప్పుడు యాసంగికి నీళ్లందించేందుకు మరమ్మతులు చేపట్టాలని ఆయకట్టు రైతులు ఆందోళన చేస్తుంటే.. తమ పరిహారం సంగతి తేల్చాకే గండి పూడ్చాలని ముంపు గ్రామాలు భీష్మించాయి.

11 ఏండ్ల కిందట ఎల్లంపల్లి ఫేస్ 1, ఫేస్ 2 కింద రిజర్వాయర్ కోసం భూసేకరణ చేశారు. అప్పట్లోనే ముంపు ఇండ్లకు నష్ట పరిహారం చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఏళ్లు గడుస్తున్నా.. ఆ హామీ గురించి మాట్లాడకుండా రిజర్వాయర్‌ను పూర్తి చేశారు. దీంతో ప్రతి వర్షాకాలంలో రిజర్వాయర్‌కు వస్తున్న భారీ వరదతో సమీప గ్రామాల్లోకి నీళ్లు వస్తున్నాయి. మొన్నటి వానాకాలం భారీ వర్షాలకు నారాయణపూర్ రిజర్వాయర్ సహా దాని కింద ఉన్న గంగాధర చెరువుకూ గండి పడింది. దీంతో దాని సమీపంలోని ఐదు ఊర్లు నీట మునిగాయి. రోడ్లు ధ్వంసమయ్యాయి. కట్టుబట్టలతో ఆయా గ్రామాల ప్రజలు పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్నారు. ముఖ్యంగా నారాయణపూర్, మంగపేట, చర్లపల్లి ఎన్ గ్రామాల్లో కొందరు ఇప్పటికీ ఊర్లు విడిచి పక్క గ్రామాల్లో తలదాచుకుంటున్నారు. ఈ నేపథ్యంలో నారాయణపూర్, చర్లపల్లి(ఎన్), మంగపేట గ్రామాల్లో 240 ఎకరాలు, నారాయణపూర్‌లో 25 ఇళ్లు, మంగపేటలో 11 ఇళ్లు, చర్లపల్లిలో కొన్ని ఇళ్లు ముంపునకు గురవుతున్నట్టు అధికారులు గుర్తించారు. ఈ ఇళ్ల యజమానులకు ఇప్పటివరకు పరిహారం అందలేదు. మంగపేటలో 87.16 ఎకరాల సాగుభూమి, 40 వ్యవసాయ బావులు, 11 ఇండ్లకు నాలుగేండ్ల కిందట అవార్డు ఎంక్వైరీ చేసి నిర్వాసితులు సంతకాలు చేసినా ఇంతవరకు పరిహారం అందలేదు. దీంతో ఇప్పుడు రిజర్వాయర్‌కు మరమ్మతులు చేస్తే మళ్లీ ముంపు సమస్య వస్తుందని, తమకు రావాల్సిన రూ.16.50కోట్ల పరిహారం అందించాకే పూడ్చాలని నిర్వాసితులు భీష్మించారు. గతంలో కరీంనగర్ కలెక్టరేట్ ఎదుటా ఆందోళన చేశారు.

ప్రశ్నార్థకంగా 1.65లక్షల ఎకరాలు

మూడు జిల్లాల పరిధిలోని పలు గ్రామాల్లో సుమారు 1.65లక్షల ఎకరాలకు గంగాధర, నారాయణపూర్ జలాశయాల నుంచి ఎల్లంపల్లి ద్వారా నీటిని అందిస్తున్నారు. ఇప్పుడు సకాలంలో ఈ చెరువుల మరమ్మతులు చేసి నీరందించకపోతే సగం విస్తీర్ణంలోనూ పంట సాగు చేసే పరిస్థితి లేదు. నారాయణపూర్ రిజర్వాయర్ నుంచే చొప్పదండి, వేములవాడ నియోజకవర్గాల్లోని దాదాపు 60 చెరువులు, కుంటలను ప్రతి యాసంగి సీజన్‌లో నింపుతున్నారు. ఆయా చెరువులు నిండితేనే ఎండాకాలంలోనూ భూగర్భజలాలు అందుబాటులో ఉంటున్నాయి. ప్రస్తుతం వానాకాలం పంట కోతలు పూర్తయ్యాయి. యాసంగి సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో వచ్చే ఏప్రిల్ వరకు సాగు నీరందించాల్సి ఉంటుంది.

ఇంతవరకు ముంపు సమస్య తేల్చకుండా.. రిజర్వాయర్‌కు మరమ్మతులు చేయకుండా సమస్యను ప్రభుత్వం జఠిలంగా మారుస్తోంది. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే వచ్చే ఎండాకాలంలో గ్రామాలకు తాగునీటికీ ఇక్కట్లు ఎదురయ్యే ప్రమాదం లేకపోలేదు.

శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్‌కు మేడిపల్లి వినతి

నారాయణపూర్, గంగాధర జలాశయాల గండ్లను పూడ్చి చొప్పదండి నియోజకవర్గ రైతాంగానికి యాసంగి పంటకు నీరు అందించాలని కాంగ్రెస్ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం గురువారం కరీంనగర్ కలెక్టర్ ఆర్‌వీకర్ణన్‌ను కలిశారు. నారాయణపూర్, మంగపేట, చర్లపల్లి, ఇస్తారుపల్లి గ్రామాలను ముంపు గ్రామాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఏళ్లు గడుస్తున్నా.. పరిహారం తేల్చకుండా.. ముంపు బాధితులను బాధిస్తున్నారని, ఇప్పుడు గండి పడిన రిజర్వాయర్లకు మరమ్మతులు చేయకుండా తాత్సారం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తూ పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు.